క్లుప్తంగా

మండల విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరణ



అమర్తలూరు(వేమూరు): మండల విద్యా శాఖాధికారి–1 గా వనజాక్షి బాధ్యతలను మంగళవారం చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జిగా పని చేసిన మండల విద్యాశాఖాధికారి–1 నిజాపట్నం మండల విద్యాశాఖాధికారిగా వెళ్లారు. ఆయన స్థానంలో కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న వనజాక్షి ఇన్‌చార్జి మండల విద్యా శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టారు. మండల విద్యా శాఖాధికారి–2 కనపాల రమేష్ ఆమెకు సన్మానం చేసి అభినందించారు.

రేపు భట్టిప్రోలులో జలదీక్ష

భట్టిప్రోలు: మురుగు కాలువ వల్ల పంట నష్టం జరుగుతుందని.. వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు దీనిపై జలదీక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రైతన్నలకు పిలుపునిచ్చారు. దీక్షకు సంబంధించిన వివరాలను భట్టిప్రోలు మండల కన్వీనర్ పి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. అద్దేపల్లి నుంచి కనగాల మీదగా గూడవల్లి గంగోలు మురుగు కాలువ అప్లాండ్ తూటి కాడలు, గుర్రపు డెక్కలతో మురుగు నీరు నిలిచిపోయి సుమారు 2,500 ఎకరాల పంట భూములు ముంపునకు గురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రైతుల పక్షాన అశోక్‌బాబు నిలబడి మురుగు నీటి కాలువ శాశ్వత పరిష్కారం కోసం గురువారం ఉదయం 10 గంటలకు మురుగు కాలువ వద్ద జలదీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అధిక ధరలకు యూరియా విక్రయిస్తే ఉపేక్షించం

భట్టిప్రోలు: యూరియా కొరత వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దని మండల వ్యవసాయ శాఖాధికారి డి.బ్రహ్మారెడ్డి తెలిపారు. మంగళవారం భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి రైతు సేవా కేంద్రంలో రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని మొత్తం 18 ఎరువుల దుకాణాలలో యూరియా 530 టన్నులు డీఏపీ 296 టన్నులు, కాంప్లెక్స్ 216 టన్నుల నిల్వలు ఉన్నాయని చెప్పారు. మండలంలోని రైతుల అవసరాల మేరకు యూరియా 120 టన్నులు, డీఏపీ 80 టన్నులు, ఇండెంట్ పెట్టడం జరిగిందని పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. ఎవరైన యూరియా ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన



నగరం: శక్తి యాప్‌పై మహిళలు, విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని రేపల్లె సబ్ డివిజన్ శక్తి టీం ఇన్‌చార్జి, నగరం ఎస్‌ఐ బండ్ల భార్గవ్ తెలిపారు. స్థానిక ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో మంగళవారం శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ.. మహిళల భద్రతకు శక్తి యాప్ దోహదపడుతుందన్నారు. అనంతరం యాప్ డౌన్‌లోడింగ్, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, పోక్సో చట్టాలు వంటి వాటిపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.

అనధికార లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ గడువు పెంపు

తెనాలి అర్బన్: అనధికార లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని అక్టోబర్ 24 లోపు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తెనాలి మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనధికార లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకాన్ని గతంలో ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఈనెల 26వ తేదీతో గడువు ముగియడంతో దానిని అక్టోబర్ 24 వరకు పొడిగించిందని చెప్పారు. సమావేశంలో ఏసీపీ శివన్నారాయణ, ఆరోగ్యాధికారి డాక్టర్ యేసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో చదివితే బంగారు భవిష్యత్

తెనాలి అర్బన్: విద్యార్థులు ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల అధ్యక్షులు బొల్లిముంత అమరేశ్వరరావు పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిగ్రీ విద్యార్థులకు కూడా ఐటీ కంపెనీల్లో ఉన్నత ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమ కళాశాలలో చదివిన విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ బొల్లిముంత శివరామకృష్ణ, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తటాకాలను తలపిస్తున్న రహదారులు!

- మరమ్మతులకు నోచుకోని గుంతలు
- గుంతలమయమైన రోడ్లలో ప్రయాణికుల అవస్థలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనచోదకులు



ఆవులవారిపాలెం రామాలయం మలుపు వద్ద భారీ గుంతలు

కొల్లూరు: రహదారుల వ్యవస్థ తారుమారవ్వడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం రహదారుల వ్యవస్థ మెరుగుపరుస్తామన్న మాటలు నీటిమీద రాతలనడానికి మండలంలోని రహదారులే నిదర్శనం. ఇటీవల మరమ్మతులు చేసిన రోడ్లు నెలల వ్యవధిలోనే చిన్నాభిన్నం అయ్యాయి. మండలంలోని కొల్లూరు, ఆవులవారిపాలెం–గాజుల్లంక రోడ్లు మూడు నెలల వ్యవధిలోనే ఛిద్రమయ్యాయి. ఫలితంగా మరమ్మతులకు వెచ్చించిన రూ.లక్షలు బూడిదలో పోసిన పన్నీరుగా మిగిలాయి. కొల్లూరు నుంచి లంక గ్రామాలకు వెళ్లే రోడ్డు



కొల్లూరు లాక్‌సెంటర్‌లో గుంతలో బుసక మట్టి గుట్ట

లాక్‌సెంటర్, జమ్మిచెట్టు ప్రాంతాలతో పాటు, ఇతర ప్రాంతాలలో తటాకాలను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులతో పాటు, విద్యార్థులు సైతం నిత్యం రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు.

నామమాత్రంగా పనులు..

భారీ గుంతల కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో గుంతలను పూడ్చేందుకు బుసక మట్టిని వినియోగించి నామమాత్రపు పనులతో అధికారులు చేతులు దులుపుకోవడం గమనార్హం. ఫలితంగా వాహనాలు గుంత, మట్టి ప్రాంతాల్లో ఇరుక్కుపోయి పరిస్థితి మరింత ప్రమాదకరంగా తయారవుతుందని వాహన చోదకులు వాపోతున్నారు. మండలంలోని ఆవులవారిపాలెంలో మూడు నెలల క్రితం మరమ్మతులు చేపట్టిన రోడ్డు భారీ ఇసుక వాహనాల కారణంగా పూర్తిగా ఛిద్రమైంది. దీంతో ప్రజలు ప్రయాణ కష్టాలను ఎదుర్కొంటున్నారు. భారీ గుంతలలో ద్విచక్ర వాహనదారులు, సైకిళ్లపై ప్రయాణించే విద్యార్థులు ప్రమాదాలకు గురవుతుండటంపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతుంది.

పనుల్లో నాసిరకం..

గాజుల్లంక చినరేవు ప్రాంతంలో సైతం ఆర్ అండ్‌బీ రోడ్డు డొంక రోడ్డును తలపించేలా మారడంతో వాహనాలు బురదలో జారి తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్ల మరమ్మతుల సమయంలో కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేపట్టారని.. ఫలితంగా నెలల వ్యవధిలోనే రోడ్లు పాడై ప్రయాణానికి పనికిరాని విధంగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పనులను పర్యవేక్షించి నిబంధనలకు అనుగుణంగా మరమ్మతులు చేపట్టించాల్సిన సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారన్న కారణంగానే రహదారి వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారిందన్న విమర్శలూ మరో వైపు వినబడుతున్నాయి.



ఆవులవారిపాలెం మిల్లు సమీపంలో ప్రమాదకరంగా ఆర్అండ్‌బీ రోడ్డు

రైతులు పంటలకు సకాలంలో పోషకాలను అందించాలి

భట్టిప్రోలు: రైతులు పంటలకు సకాలంలో యూరియా, డీఏపీ వంటి పోషకాలను అందించడం ద్వారా నత్రజని, భాస్వరం పోషక లోపాలు రాకుండా జాగ్రత్త పడవచ్చునని.. తద్వారా పైరు ఎదుగుదల బాగుంటుందని భట్టిప్రోలు ఏవో బి.బ్రహ్మారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఐలవరం, అద్దేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో ఖరీఫ్ 2025కి సంబంధించి ఈ క్రాప్ నమోదు చేయడం మొదలవుతుందని పేర్కొన్నారు. సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల ద్వారా తమ పంట వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో వెద పెట్టిన వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈవో కె.లక్ష్మి ప్రసన్న, వీఏఏలు మహేంద్ర, ప్రవీణ్, ఎంపీఈవో భార్గవి, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులతో పర్యావరణానికి ముప్పు

రేపల్లె: రసాయన ఎరువుల వినియోగంతో పంట దిగుబడులు తగ్గటంతో పాటు భూసారం నశించిపోతుందని వ్యవసాయ శాఖ రేపల్లె డివిజన్ సహాయ సంచాలకులు అద్దేపల్లి లక్ష్మి అన్నారు. రేపల్లె పట్టణ, కారుమూరు గ్రామాలలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షల ఆధారంగా వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సేంద్రీయ ఎరువులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో అవ్వారు మహేష్ బాబు, ఏఈవో సుమంత్, వీఏఏ యశ్విని, ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'పొలం పిలుస్తోంది'లో రైతులకు అవగాహన

అమర్తలూరు(వేమూరు): పంటలు సాగు చేస్తున్న రైతులందరూ గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.హేమంత్ భరత్ కుమార్ తెలిపారు. అమర్తలూరు మండలంలోని మోపర్రు, వామన గుంటపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు పంట బీమా గురించి ఆయన వివరించారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



కారుమూరులో అవగాహన కల్పిస్తున్న లక్ష్మి



ఐలవరం కార్యక్రమంలో పాల్గొన్న ఏవో బ్రహ్మారెడ్డి

కొల్లూరు: ఖరీఫ్‌లో వెద పద్ధతిలో వరి సాగు చేసిన రైతులు జింక్ లోపాలను నివారించడంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయశాఖాధికారి వి.నరేంద్రబాబు అన్నారు. మండలంలోని క్రాప, రావికంపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.ప్రభాకరరావు, బీఎస్ వంశీ, వీఏఏలు బి.సాంబనాయక్, కేఆర్ మాధురి పాల్గొన్నారు.



మోపర్రు కార్యక్రమంలో వ్యవసాయాధికారులు

కర్లపాలెం: ఖరీఫ్‌లో పంటలు సాగుచేస్తున్న రైతులందరూ ఆగష్టు 15వ తేదీ లోపు పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలని జిల్లా జల వనరుల కేంద్రం ఏడీఏ రమాదేవి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గణపవరం, పేరలి గ్రామాలలో పొలం పిలుస్తోంది సభలు నిర్వహించారు. ఏడీఏ రమాదేవి మాట్లాడుతూ.. పంటలు సాగు చేస్తున్న రైతులందరూ పంట నమోదు చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏవో సుమంత్‌కుమార్, విస్తరణాధికారి భాగ్యలక్ష్మి, భాషా, గ్రామ వ్యవసాయ సహాయకులు దీప్తి, గ్లోరి, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ రమాదేవి

వేమూరు: రైతులకు యూరియా కొరత లేకుండా అందించనున్నట్లు మండల వ్యవసాయాధికార ప్రేమ సాగర్ తెలిపారు. మండలంలోని పెనుమర్రు, కోడేపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా అందిస్తోందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



పెనుమర్రు కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

పోషక విలువలు గల విత్తనాలు పంపిణీ

వేమూరు: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ట్రస్ట్ అంగన్‌వాడీ కేంద్రాలకు అందించడం ఆనందంగా ఉందని చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ అధికారి సీడీపీవో శ్రీలక్ష్మి తెలిపారు. వేమూరు మండలంలోని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ బాలల రక్షణ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. చావలి, బలిజేపల్లి, కోడేపర్రు, పెరవలిపాలెం, వేమూరు, జంపని, వరహాపురం, పోతుమర్రు గ్రామాల్లో న్యూట్రీ కిచెన్ గార్డెన్ విత్తనాలను అంగన్‌వాడీ వర్కర్లకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో శ్రీలక్ష్మి

స్వమిత్వ సర్వేతో చట్టబద్ధమైన భూమి హక్కులు

కొల్లిపర: గ్రామాలల్లో నిర్వహించే స్వమిత్వ సర్వే ద్వారా ఆస్తి యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు కల్పించవచ్చునని ఈవోపీఆర్డీ భార్గవ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్, ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌లకు స్వమిత్వ సర్వే ఫేస్ 2 గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాన కల్పించటానికి వచ్చిన వల్లభాపురం గ్రామ సచివాలయం–1 సర్వేయర్ కె.జగన్మోహనరావు మాట్లాడుతూ.. గ్రామాల్లో స్వమిత్వ ఈ సర్వేలో ప్రభుత్వ ఆస్తులు, గ్రామ సభ భూమి పార్శిళ్లు, వ్యక్తిగత ఆస్తులు, రోడ్లు, బహిరంగ ప్లాట్‌లతో సహా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకొని భూమి పార్శిళ్లను మ్యాప్ చేయడం ద్వారా ఆస్తి యజమానులకు చట్టబద్ధమైన యాజమాన్య ఆస్తి కార్డులు, టైటిల్ డీడ్‌లు జారీ చేయటం జరుగుతుందన్నారు. సర్వే జరిగే క్రమంలో గ్రామంలో ఏది గ్రామ కంఠం, ఏది ప్రభుత్వ స్థలాలు అనేది ముందుగా అధికారులకు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం సర్వే గురించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పెదకాకాని: మహిళ అదృశ్యం కావడంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన 38 సంవత్సరాల మహిళ షేక్ నజియా ఈనెల 12వ తేదిన ఇంటి నుండి బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. బంధువులకు డబ్బులు ఇవ్వడానికి వెళుతున్నానని చెప్పి వెళ్ళిన ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులకు సమాచారం తెలిజేశారు. చుట్టుప్రక్కల గ్రామా ల్లో వెతికినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదు. భర్త షేక్ ఫారుఖ్ ఫిర్యాదు మేరకు నజియా అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మంగళవారం సీఐ నారాయణస్వామి తెలిపారు. ఈ మహిళ గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే పెదకాకాని పోలీసుస్టేషన్ 8688831350 కు సమాచారం అందించాలన్నారు.

భట్టిప్రోలులో శ్రావణ మాస పూజలు

భట్టిప్రోలు: ఆది శంకరాచార్యులు అమ్మను పొగిడి కీర్తించి శ్రీ చక్రంలో నిలయమయ్యేలా చేశారని.. ఈ సందర్భంగా శ్రావణ మాస పూజలను నిర్వహించామని శుక్రవారం కమిటీ ప్రధాన నిర్వాహకురాలు బూర్లె అరుణ కుమారి తెలిపారు. మంగళవారం నిర్వహించిప శ్రావణ మాస పూజల్లో భట్టిప్రోలులోని తూనుగుంట్ల చిత్తరంజన్ దంపతులు పాల్గొన్నారు.

మున్సిపల్ సాధారణ సమావేశం రేపు

రేపల్లె: మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు మంగళవారం తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉపకరణాల నిర్ధారణ శిబిరం రేపు

భట్టిప్రోలు: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు గురువారం కొల్లూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎస్‌బీఎఫ్ఎస్)లో ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి నీలం దేవరాజ్ మంగళవారం తెలిపారు. సమగ్ర శిక్షా, అలంకో ఇండియా లిమిటెడ్(ముంబాయి) సంయుక్త ఆధ్వర్యంలో భట్టిప్రోలు, వేమూరు, కొల్లూరు, చుండూరు, అమృతలూరు మండలాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత హైస్కూల్స్‌లో చదివే 18 ఏళ్ల లోపు విద్యార్థులకు ఈ కార్యక్రమం జరుగనుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆధార్, రేషన్ కార్డులు, సదరన్ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు వెంట తీసుకువెళ్లాలని తెలిపారు.

కొల్లూరు: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు గురువారం ఉపకరణాల నిర్ధారణ శిబిరం కొల్లూరులోని బీఎస్ఎస్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈవో–2 వీఎస్ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని 5 మండలాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదవుతున్న 18 ఏళ్ల లోపు వయస్సు గల విద్యార్థులు ఈ శిబిరంలో హాజరై వారికి అవసరమైన ఉపకరణాల నిర్ధారణలో పాల్గొనాలని సూచించారు.

ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అమలు ఎప్పుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: సంపద సృష్టించి ప్రజలకు సంక్షేమ పథకాలందిస్తానని చెప్పిన చంద్రబాబును.. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తావని వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గం సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం కర్లపాలెం మండల పరిధిలోని యాజలి, దుండివారిపాలెం, తుమ్మలపల్లి, గ్రామాలలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ రచ్చబండ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ.. సంపద సృష్టించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పిన చంద్రబాబు ఏడాదిలో రూ.1.72 వేల కోట్ల అప్పు చేశారని మండిపడ్డారు. పదవి కోసం చంద్రబాబు ఎన్ని అబద్ధాలైనా ఆడతాడని.. ప్రజలే పదే పదే మోసపోతున్నారని ఆయన తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.510 కోట్లతో బాపట్లకు మెడికల్ కాలేజీతో పాటు పెద్దాసుపత్రి మంజూరు చేస్తే కూటమి ప్రభుత్వం వచ్చి నిర్మాణాలను ఆపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నాదెండ్ల భానుప్రసాద్, పులుగు గోవిందమ్మ.. భర్త మునిచంద్రారెడ్డి, దబ్బకూటి ఏడుకొండలు, ఎంపీపీ యారం వనజ, వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, నాయకులు చిక్కాల సాగర్, ఆసిఫ్ అలీ, అమీర్‌బేగ్, మరుప్రోలు శివారెడ్డి, దొంతిబోయిన జయభారత్‌రెడ్డి, దేవరకొండ రమేష్, మార్పు బెనర్జి, పులుగు స్వామిరెడ్డి, దొంతిరెడ్డి శివారెడ్డి, ఇమ్రాన్, హరిరాజు, తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకించాలి

భట్టిప్రోలు: మోటారు వాహన డ్రైవర్లపై పెనుభారాలను మోపేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా ఆటో కార్మికులు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లోని శ్రీ లక్ష్మి గణపతి ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నూతనంగా నిర్మించిన యూనియన్ జెండా దిమ్మె ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేటర్లకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. సభలో యూనియన్ అధ్యక్షులు కట్టా వెంకటేశ్వరరావు, రేపల్లె ఏరియా గౌరవ అధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ, వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు బండారు శ్రీనివాసరావు, ఆటో యూనియన్ నాయకులు నాగూర్ మీరా, జగన్నాథం వెంకటేశ్వరరావు, పీటర్ పాల్, కట్టా సుబ్బారావు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, డ్రైవర్లు

మాజీ కౌన్సిలర్ ఇమ్మడిశెట్టి అంకమ్మరావు మృతి

బాపట్ల: బాపట్ల మాజీ కౌన్సిలర్ ఇమ్మడిశెట్టి అంకమ్మరావు(60) మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అని మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. గుండెపోటుతో మంగళవారం మృతి చెందిన అంకమ్మరావు మృతదేహానికి పూలమాలలు వేసి ఆయన నివాళి అర్పించారు. బాపట్ల పట్టణంలోని 24వవార్డు కౌన్సిలర్‌గా సుదీర్ఘ అనుభవంతో ఈ ప్రాంతాభివృద్ధికి అంకమ్మరావు కృషి చేశారని గుర్తు చేశారు. అంకమ్మరావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రజా సమస్యలపై మున్సిపల్ కౌన్సిల్‌లో చురుకైన పాత్ర పోషించారని మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరరావు గుర్తు చేసుకున్నారు. నివాళి అర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్నగుప్తా, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్లు నర్రావుల వెంకట్రావు, నర్రా వెంకట్రావు, మలబంటి కోటేశ్వరరావు, వాసు తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం అందజేత

రేపల్లె: క్షయవ్యాధి గ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్యులు నిర్దేశించిన మందులు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకరం తెలిపారు. టీబీ విభాగం రేపల్లె ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో పలువురు క్షయవ్యాధి గ్రస్తులకు మంగళవారం ఆయన పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. క్రమం తప్పకుండా దగ్గు, జ్వరం ఉండటంతో పాటు ఒక్కసారిగా శరీరం బరువు తగ్గిపోవటం క్షయవ్యాధి లక్షణాలు అన్నారు. లక్షణాలు ఉన్న వారు సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు చైతన్య, పృథ్వీ గణేష్, జీవన్, టీబీ సూపర్‌వైజర్‌లు గూడవల్లి వెంకటేశ్వరరావు, గల్లా చక్రధర్, రాగిపాటి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకరం

సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను మోసం

వేమూరు: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసిందని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్ అన్నారు. వేమూరు గ్రామంలో అంబేడ్కర్ నగర్‌లో మంగళవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు ఏడాది పాలనను, ప్రజలను మోసం చేసిన విధానం గురించి చెప్పారు. ఖరీఫ్ సీజనలో రైతులకు ఇంత వరకూ రైతు భరోసా డబ్బులు చెల్లించలేదన్నారు. రైతులు వ్యవసాయ సాగు చేసేందుకు డబ్బులు లేక బాధలు పడుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గుమ్మడి దానియేలు, దున్నా మేరీసుబాబు, పిల్లి శ్యామ్, బొల్లెదు గోపి, అమర్తలూరు వెంకయ్య, తలతోటి సురేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కోగంటి లవకుమార్

ఆన్‌కాల్ డ్రైవర్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె: ఏపీఎస్ఆర్టీసీ రేపల్లె డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్‌లుగా విధులు నిర్వహించేందుకు ఆసక్తి గల డ్రైవర్‌లు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సునీల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ వెహికల్స్ లైసెన్స్ కలిగి ఉండి, కనీసం 18 నెలలు భారీ వాహనాలు నడపటంలో అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, శిక్షణ ఇవ్వడం జరుగుతుందని.. అనంతరం ఆర్టీసీ బస్సులకు డ్యూటీలు కేటాయించగలమని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు డిపోలో సంప్రదించాలని కోరారు.